



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం 6:24(సాయంత్రం)
సెహరీ : గురువారం 4:54 (ఉదయం)



గుట్టంతా గుప్పిట్లో..!

- జిల్లాలోని ఓటర్ల సమాచారమంతా వలంటీర్ల వద్ద
- హౌస్‌హోల్డ్ రిజిస్ట్రేషన్ పేరిట 2019లోనే సేకరణ
- అదంతా వైసీపీ నాయకులకు చేరినట్లు అనుమానాలు
- ఓటర్లను ప్రలోభ పెట్టేలా యత్నాలు

నంద్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకంటూ వైసీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చింది. హౌస్‌హోల్డ్ రిజిస్ట్రేషన్ల పేరిట జిల్లాలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సేకరించి పెట్టుకుంది. ప్రస్తుతం ఈ సమాచారమంతా వైసీపీ నేతల వద్దకు చేరినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే జిల్లాలోని ప్రతి కుటుంబం గుట్టు వైసీపీ నేతల చేతుల్లో ఉన్నట్లే! దీని ద్వారా ఓటర్లను సులభంగా ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్ల ద్వారానే గెలిచేందుకు అధికార పార్టీ సిద్ధమైపోయిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్లే కొన్ని చోట్ల వలంటీర్లు అధికార పార్టీ నేతలతో కలిసి ప్రచారాల్లో పాలు పంచుకుంటున్న ఘటనలు జిల్లాలో కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం హౌస్ హోల్డ్ రిజిస్టర్ల సమాచారాన్ని అడ్డుపెట్టుకుని ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా కట్టడి చేయగలిగితేనే.. రానున్న ఎన్నికల్లో అవకతవకలు జరగకుండా నిలువరించవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది.



జిల్లాలో మొత్తం 8816 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. వీరిలో పట్టణ ప్రాంతాల్లో 1805 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 7011 మంది ఉన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒకరి చొప్పున పని చేస్తున్నారు. ఒక్కో వలంటీరు పరిధిలోని కుటుంబాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రభుత్వం ఇచ్చిన హౌస్ హోల్డ్ రిజిస్ట్రేషన్‌లో పొందుపరిచారు. తర్వాత డిజిటలైజేషన్ పేరిట జీఎస్‌డబ్ల్యూఎస్ వలంటీర్ అనే మొబైల్ యాప్‌లో ఆయా కుటుంబాల వివరాలు, ప్రభుత్వం నుంచి ఏయే పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్న వివరాలు పొందుపరిచారు. ఈ వివరాలన్నీ వైసీపీ నేతలకు అందుబాటులో ఉండేవి. గడప - గడపకు వంటి కార్యక్రమంలో ఈ సమాచారం ద్వారానే ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి 'మీ కుటుంబానికి ఆయా పథకాల ద్వారా ఇంత లబ్ధి చేకూరింది' అని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వివరించగలిగారు. ఎన్నికల సమయంలో ఈ సమచారాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందవచ్చని వైసీపీ నేతలు ముందునుంచే పన్నాగం పన్నారు. అయితే వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. వలంటీర్లు మొదట మొబైల్ సిమ్‌లు, ఆ తర్వాత మొబైల్ ఫోన్లను సచివాలయంలో అప్పగించడం మొదలుపెట్టారు. దీంతో వైసీపీ నేతలు ఖంగుతిన్నారు. మొబైళ్లను స్వాధీనం చేసుకునేలోపే ఆ సమాచారన్నంతా వైసీపీ నేతల మొబైళ్లలోకి ఎక్కించుకునే పని మొదలుపెట్టారు. అయితే ఇవి పూర్తి స్థాయిలో కాకపోవడంతో మిగతా సమాచారాన్ని రాబట్టేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

రిజిస్టర్లు ఉన్నాయిగా..

జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన కుటుంబాల వివరాలు మొబైళ్లలో నిక్షిప్తం చేసినా.. వాటికి సంబంధించిన రిజిస్టర్లు మాత్రం వలంటీర్ల వద్దే ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి సిమ్‌లు, మొబైళ్లతోపాటు ఈ రిజిస్టర్లు కూడా సచివాలయంలో అందజేయాల్సి ఉన్నా.. ఇంకా వలంటీర్ల వద్దే ఉంచుకున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక వలంటీర్ల వద్ద ఉన్న హౌస్‌హోల్డ్ రిజిస్టర్లను తిరిగి తెప్పించుకునే విషయంలో సచివాలయ అడ్మిన్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ఇదే విషయాన్ని సంబంధిత అధికారులను అడగ్గా.. మొబైళ్లలో సమాచారాన్ని నిక్షిప్తం చేసే సమయంలోనే తీసుకున్నామని చెబుతున్నా అందులో వాస్తవం లేదన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. ఇక ఇదే అదునుగా భావించిన వైసీపీ నేతలు ఈ రిజిస్టర్లను చేజిక్కించుకునే పనిలో పడ్డారు. ఇలా చేస్తూ ప్రతి నియోజకవర్గంలోని ఆయా కుటుంబాల సమాచారం. ఆ ఇంట్లోని ఓటర్ల పూర్తి సమాచారం వైసీపీ నేతల వద్దకు చేరుతోంది. ఈ సమాచారంతో ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు వైసీపీకి ఓటు వేయకపోతే పరిస్థితి మరోలా ఉంటుందని భయాందోళనలకు గురి చేస్తున్నట్టు తెలుస్తోంది.

కాపాడుతున్నారా..?

ఎన్నికల విధుల్లో వివిధ రకాలుగా వలంటీర్లను ఉపయోగించుకుంటున్న వైసీపీ నేతలు.. వారికి అధికారుల నుంచి ఏ ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నంద్యాల జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన మండలంలో వైసీపీ నేతల ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారన్న ఫిర్యాదు అధికారులకు అందింది. అయితే సదరు మండలానికి వెళ్లిన అధికారులు వలంటీర్లను మందలించి వదిలి వేశారు తప్పించి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. దీని వెనుక అధికార పార్టీ సదరు నేత ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఆయా చోట్ల ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, సిబ్బందిని సన్నద్ధం చేయడం, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల వంటి అంశాలపై దృష్టి పెట్టింది. దీంతో వలంటీర్ల వ్యవహారాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టలేకపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పని చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

కేసు పెడితే అంతే..

వలంటీర్ ఉద్యోగాలు సంపాదించిన వారంతా మంచి చదువులు వెలగబెట్టినవారే! వీరిలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకున్నవారు కూడా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వరకు ఆసరాగా ఉంటుందని వలంటీర్ ఉద్యోగంలో చేరారు. ఈ ఉద్యోగంలో చేరాక పూర్తిగా వైసీపీ నేతలకు వత్తాసు పలుకుతూ వచ్చారు. అయితే ఇలా చేస్తున్న వారంతా భవిష్యత్తు పరిణామాలను ఊహించలేకపోతున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అధికార యంత్రాంగం కేసులు పెడితే భవిష్యత్తులో వలంటీర్లు ఏ ప్రభుత్వ ఉద్యోగానికి కూడా అర్హత సాధించలేరు. దీనికి తోడు కేసులంటూ కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంటుంది. పైగా తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యే అవకాశం ఉంది.



అంతా వారి మనుషులేగా..

వైసీపీ అధికారంలోకి వచ్చిన వలంటీర్ వ్యవస్థలోని వారంతా వైసీపీ నేతలకు సంబంధించిన వారే.! వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన ఉద్యోగాలన్న ఉద్దేశంతో చాలా మంది వలంటీర్లు స్వామి భక్తిని ప్రదర్శిస్తూ, బహిరంగంగానే వైసీపీ నేతలతో కలిసి ప్రచారాల్లో కూడా పాల్గొంటున్నారు. ఇలా చేసే వలంటీర్లపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నా కొంతమంది వెనుకాడడం లేదు. కొంతమంది అయితే వలంటీరు జాబును వదిలేసి వైసీపీ నేతలతో తిరిగేందుకు సిద్ధమయ్యారు. కొన్ని నియోజకవర్గాల్లోని నాయకులైతే ఈ రెండు నెలలు జాబును పక్కకు పెట్టేయండని, జీతాలు కావాలంటే తాము ఇస్తామని వలంటీర్లకు చెబుతుండటం గమనార్హం. ఇక కొన్ని చోట్ల వలంటీర్ల వద్ద ఉన్న సమాచారాన్ని తీసుకుని వారి కుటుంబ సభ్యుల ద్వారా కూడా తమకు కావాల్సిన విధంగా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వైసీపీ నేతలు సిద్ధమయ్యారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తానికి వలంటీరు వ్యవస్థను పకడ్బందీగా ఉపయోగించుకునేందుకు అధికార పార్టీ నేతలు ముందు నుంచి ఓ ప్లాన్‌తో ఉన్నారని తెలుస్తోంది



పేదల ద్రోహి సీఎం జగన్

మాజీ ఎమ్మెల్యే బీసీ



బనగానపల్లె, మార్చి 26: పేద ప్రజల ద్రోహి సీఎం జగన్ అని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ గ్రామ గ్రామాన బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కల్తీ మద్యం అమ్ముతూ పేదల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్న సీఎం జగన్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదని చెప్పారు. ప్రత్యేక హోదాను తుంగలో తొక్కారని, పోలవరం ప్రాజెక్టును అటకెక్కించి రైతులకు అన్యాయం చేశారని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచి ప్రజలపై రూ.64 వేల కోట్ల భారం వేశారని, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లలో రూ.15 వేల కోట్లు సీఎం జగన్ దోచుకున్నారని ఆరోపించారు. 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మాట తప్పారని, మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారని ధ్వజమెత్తారు. కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను తరిమివేసి పరిశ్రమలు రాకుండా చేశారని, ఇసుక మాఫియాకు అండగా నిలిచి రూ.50 వేల కోట్లు లూటీ చేశారని ఆరోపించారు. ఇసుక రేట్లు భారీగా పెంచి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా చేసి వారి పొట్ట గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్, పెట్రోల్ ధరలు ఏపీలోనే అధికంగా ఉన్నాయని తెలిపారు. అప్పులు భారీగా చేసి ప్రతి కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపారన్నారు. 25 లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తానని చెప్పి మాట తప్పిన జగన్ టిడ్కో ఇళ్లను తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్ల అప్పు చేశారని చెప్పారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అధికంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి వారిని మోసం చేశారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కుదించి కొంత మంది విద్యార్థులకే ఈ పథకం వర్తింప చేయడం అన్యాయమని ఆవేదన వెలిబుచ్చారు. కౌలు రైతులందరికీ వడ్డీలేని రుణాలు ఇస్తామని మాట ఇచ్చి మాట తప్పారని అన్నారు. అన్న క్యాంటీన్లను రద్దు చేసి పేదల కడుపు కొట్టారన్నారు. అసైన్డు భూములను రక్షించాల్సిందిపోయి 14 లక్షల ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు
ఎగువన గరుడోత్సవం

ఆళ్లగడ్డ, మార్చి 26: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎగువ అహోబిలంలో పన్నెండో రోజు మంగళవారం జ్వాలా నరసింహస్వామికి గరుడోత్సవం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఈనెల 25వ తేదీన ముగిశాయి. అయితే స్వామి వారి గరుడోత్సవం ఈ నెల 25వ తేది అర్ధరాత్రి వరకు కొనసాగాయి. బ్రహ్మోత్సవాలలో స్వామి వారు వివిధ వాహన సేవలపై భక్తులకు దర్శనం ఇచ్చారు.

దిగువ అహోబిలంలో..

అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా దిగువ అహోబిలంలో మంగళవారం ప్రహ్లాద వరదస్వామికి అవభృత, తీర్థవారి చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించారు ముందుగా ప్రహ్లాద వరదస్వామికి ఉత్సవం, ద్వాదశారాధనం, పుష్పయాగం, గరుడోత్సవం కార్యక్రమాలను వేదపండితులు చేపట్టారు..

నేడు దిగువ అహోబిలంలో..

దిగువ అహోబిలంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు పహ్లాద వరదస్వామికి తెప్పోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు చేపట్టనున్నారు.



దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామికి తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తున్న రథోత్సవం



ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామికి గరుడోత్సవం చేస్తున్న వేదపండితులు

చెక్‌పోస్ట్‌లలో ముమ్మర తనిఖీలు



పత్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, మార్చి 26 : నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు చెక్‌పోస్ట్‌లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. అన్ని చెక్‌పోస్ట్‌లలో గంజాయి, మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకోడానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఎస్పీ పాణ్యం మండలం తమ్మరాజుపల్లెలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలుసూచనలు జారీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చెక్‌పోస్ట్‌లలో సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా పనిచేస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. చెక్‌పోస్టులలో మాత్రమే కాకుండా జిల్లాలో ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేయాలని అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, సీఐలు సూర్యమౌళి, నల్లప్ప, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్

కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు



నంద్యాల (కల్చరల్), మార్చి 26: ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో గుర్తించిన 25,300 ఫొటోలు, పోస్టర్లు, ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించామని అన్నారు. అలాగే ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ప్రచురితమైన ప్రతికూల వార్తలకు బాధ్యులను చేస్తూ సంబంధిత 40 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశామన్నారు. రాజకీయ ప్రచారంలో పాల్గొన్న 12 మంది వలంటీర్లను తొలగించి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. అభ్యర్థుల ప్రచారానికి వాహన అనుమతుల కోసం 123 దరఖాస్తులు వచ్చాయని, అందులో 80 దరఖాస్తులకు వాహన అనుమతులు మంజూరు చేశామని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు చేపట్టిన పనులు మాత్రమే కొనసాగుతాయని కొత్త పనులు మంజూరు చేయడం లేదని అన్నారు. సి విజిల్ ద్వారా 78 ఫిర్యాదులు అందాయని, 100 నిమిషాల్లో ఆ ఫిర్యాదులను పరిష్కరించామని అన్నారు. ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా రాజకీయ పార్టీలు ప్రచారాన్ని కొనసాగిస్తే ఎంసీపీ కింద చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఓ ప్రార్థనా మందిరంలో రాజకీయ ప్రసంగం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ నెంబరు:1950(టోల్‌ఫ్రీ) కాల్ సెంటర్ నెంబర్లు 08514-293905,08514-293906 సంప్రదించి ఎన్నికల సమాచారంతో పాటు తమ ఓటు వివరాలను తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.


ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

- ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయిన తల్లీ బిడ్డలు



తల్లి, ముగ్గురు పిల్లలతో గైనిక్ మూడో యూనిట్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 26: ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది ఓ తల్లి. కల్లూరు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన పవన్ కుమార్ భార్య సుష్మారాణి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నారు. ఆమె ఈ నెల 6వ తేదీన మొదటి కాన్పు కోసం కర్నూలు జీజీహెచ్ గైనిక్ విభాగంలోని 3వ యూనిట్‌లో అడ్మిట్ అయ్యారు. యూనిట్ చీఫ్ డా.సావిత్రీ సుధాకర్ పరీక్షలు నిర్వహించారు. బీపీ ఎక్కువ కావడంతో 15 రోజులుగా వార్డులోనే ఉంచి చికిత్స అందించారు. చివరకు ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు గర్భిణికి ప్రొఫెసర్ డా.సావిత్రి, అసోసియేట్ ప్రొఫెసర్ కుముద, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుగుణశ్రీ, రేవతి అనస్థీషియా వైద్యులు శ్రీలత బృందం సిజేరియన్ ఆపరేషన్ చేశారు. నిమిషం వ్యవధిలో వరుసగా ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మొదటి ఆడ శిశువు 1.9 కేజీలు ఉండగా, మిగిలిన మగపిల్లలు 1.5 కేజీలు ఒకరు, మరొకరు 1.9 కేజీలు ఉన్నారు. తల్లీ పిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్లు డా.సావిత్రి సుధాకర్ తెలిపారు. వారిని మంగళవారం డిశ్చార్జ్ చేశామన్నారు.





కర్నూలు ఐదు రోడ్ల కూడలిలో పని కోసం అడ్డా కూలీల నిరీక్షణ

నేతలది ఓట్ల వేట.. పేదలది బతుకు బాట

కర్నూలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణ రంగంపై ఆధార పడుతున్న అడ్డా కూలీల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది వర్షాభావం పరిస్థితుల వల్ల గ్రామ సీమల్లో తీవ్ర కరువు దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. పశ్చిమ ప్రాంతం నుంచి లక్షల కుటుంబాలు తెలంగాణ, గుంటూరు, పల్నాడు ప్రాంతాల్లో పత్తితీత, మిరప కోత పనులకు వలస వెళ్లారు. పట్టణ, నగర శివారు గ్రామాల్లో రైతులు అడ్డా కూలీలుగా మారుతున్నారు. జిల్లాలో భవన నిర్మాణం సహా ఇతర పనులపై ఆధారపడిన అసంఘటిత కార్మికులు సుమారు 5.45 లక్షల మందికిపైగా ఉన్నారు. వారిలో సగానికి పైగా అడ్డా కూలీలే. ఐదేళ్ల క్రితం ఆనాటి చంద్రబాబు ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేశారు. పుష్కలంగా ఇసుక లభించడంతో నిర్మాణ రంగం కళకళలాడేది. ఉచితంగా దొరికే ఇసుకకు కూడా టన్ను రూ.450 రేటు కట్టి ఇసుక రీచులను తన వాళ్లకే జగన్ ప్రభుత్వం అప్పగించింది. దీంతో కృత్రిమ ఇసుక కొరతను సృష్టించి డిమాండ్ పెంచడంతో నిర్మాణ రంగం కుదేలైంది. పనులు దొరక్క అడ్డా కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులకు మాత్రం ఈ కూలీల కష్టాలు పట్టడం లేదనే విమర్శ ఉంది.

పని దొరికితే పండగే..



కర్నూలు నగరంలో రైల్వే స్టేషన్ రోడ్ ఐదు రోడ్ల కూడలి, సీ క్యాంప్, గడియారం ఆస్పత్రి, నంద్యాల చెక్ పోస్టు, ఠాగూర్ నగర్, చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్ వద్ద అడ్డాలు ఉన్నాయి. నగరం నుంచే కాకుండా కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, దేవనకొండ, నందికొట్కూరు, గూడూరు మండలాల నుంచి పనులు కోసం ఈ అడ్డాలకు కూలీలు, రైతులు కూడా వస్తున్నారు. రోజు సరాసరి పది వేల మంది కూలీలు తెల్లారగానే 6 గంటలకే అడ్డాకు చేరుకుంటారు. పనులు దొరికితే ఆ రోజు పండగే.. లేదంటే మధ్యాహ్నం 11-12 గంటల వరకు నిరీక్షించి తెచ్చుకున్న సద్దెన్నం తిని ఇంటిదారి పడుతున్నారు. పని ఉన్నా.. లేకున్నా చార్జీలు, ఇతర ఖర్చులు రూపంలో రోజుకు రూ.100-150 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కో రోజు చార్జీలకు అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఊళ్లో తనకు ఐదెకరాల పొలం ఉంది. పత్తి సాగు చేస్తే అప్పే మిగిలింది. పూట గడవడం కష్టంగా మారడంతో నెల రోజులుగా పని కోసం అడ్డాకు వస్తున్నా. మొదటి రోజు పని దొరకలేదు.. చార్జీకి డబ్బుల్లేక.. చార్జీ కోసం అప్పు అడగలేక మా ఊరికి నడిచివెళ్లాలని గూడూరు మండలానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతు వాపోయారు.

- ఊళ్లలో చేద్దామంటే పనుల్లేవు
- అడ్డాకొస్తే పని దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు
- ఓట్ల కోసం వచ్చే నాయకులకు మా కష్టాలు పట్టవా?
- కర్నూలు అడ్డా కూలీల కన్నీటి వ్యథ

ఏం చేశామని ఓట్లు అడుగుతారు?

'ఊళ్లో పనులు లేవు.. ఉపాధి హామీ పనులకు వెళ్దామంటే ఆ కూలీ డబ్బులు ఎప్పుడిస్తారో గ్యారెంటీ లేదు. వారంలో రెండు మూడు రోజులు పని దొరికినా రూ.1,500 వస్తుంది. చార్జీలు, ఖర్చులు పోను వారం వారం రూ.వెయ్యి ఇంటి ఖర్చులకు వస్తుందని అడ్డాకు వస్తే ఇక్కడా పని దొరకడం కష్టంగా మారింది. దీనంతటికి ప్రధాన కారణం ఇసుక కొరతే. పేదలను మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్న ఈ ప్రభుత్వం ఏం చేశామని ఓట్లు అడుగుతారు..? జగన్ నమ్ముకొని మళ్లీ మోస పోలేం' అని కూలీలు అంటున్నారు.

పని దొరికితే పండుగే



మా ఊళ్లో పనులు లేవు. భవన నిర్మాణ పనులకు వెళితే రోజు రూ.500-600 వస్తాయని, ఇంటికి ఖర్చులకు ఇబ్బంది ఉండదని రోజు ఉదయం ఆరు గంటలకే ఆర్ఎస్ రోడ్డు ఐదు రోడ్ల కూడలి అడ్డాకు రావడం.. మధ్యాహ్నం 12 గంటల వరకు నిరీక్షించి ఇంటికి వెళ్లడం నిత్యకృత్యమైంది. ఈ ఏడాది పనులు లేక అవస్థలు పడుతున్నాం. ఇప్పుడు ఎలక్షన్లు వచ్చాయని ఓట్ల కోసం వస్తారు.. ఆ తరువాత మా నెత్తిన చేయి పెడుతారు. వారం రోజులుగా అడ్డాకు వస్తున్నా.. ఒక్క రోజు కూడా పని దొరకలేదు. ఎట్లా బతకాలయ్యా..?

- మద్దిలేటి, నిడ్జూరు గ్రామం, కర్నూలు మండలం

వారంలో రెండ్రోజులు కూడా పని ఉండదు



మా ఊరు ఇక్కడికి 50 కిలోమీటర్లు ఉంటుంది. చేద్దామంటే ఊర్లో ఉపాధి పనులు లేవు. చేసినా కూలీ ఎప్పుడిస్తారో తెలియడం లేదు. దీంతో రోజు కర్నూలు అడ్డాకు వస్తున్నాను. వారంలో రెండు రోజులు కూడా పని దొరకడం లేదు. రోజు రానుపోనూ బస్సు చార్జీ, ఆటోలకు రూ.100 ఖర్చు అవుతుంది. పని లేకపోతే పస్తులతో కాలం గడపాల్సిన పరిస్థితి మాది. ఈ ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోవడం లేదు.

- గిడ్డయ్య, పి.కోటకొండ గ్రామం, దేవనకొండ మండలం

మా ఓట్లు తప్ప కష్టాలు పట్టవా?



రాజకీయ నాయకులకు మా ఓట్లు కావాలి. పేదల కష్టాలు మాత్రం పట్టవు. ఈ ఏడాది కరువు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఊళ్లో పనులు లేవు. అడ్డాకు వస్తే పని దొరకుతుందన్న గ్యారెంటీ లేదు. రోజు కష్టపడితే రూ.500-600 వస్తుంది. అందులో చార్జీలకే రూ.100 పోతుంది. వారంలో కనీసం నాలుగు రోజులు పని దొరికితే ఆకలి తీరుతుంది. లేదంటే పస్తులతో గడపాల్సిన పరిస్థితి.

- రమణ, మండ్లెం గ్రామం, నందికొట్కూరు మండలం

29న చంద్రబాబు పర్యటన వాయిదా

ఆత్మకూరు, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఈ నెల 29న ఆత్మకూరు పట్టణంలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన వాయిదా పడినట్లు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం తెలిపారు. 29వ తేదీ గుడ్‌ఫ్రైడే, పవిత్ర రంజాన్ మాసంలోని శుక్రవారం కావడంతో చంద్రబాబు పర్యటనను వాయిదా వేయాలని కోరినట్లు చెప్పారు. ఏప్రిల్ నెలలో ఆత్మకూరులో చంద్రబాబు పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పది పరీక్షలకు 1077 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 26: పదో తరగతి పరీక్షల్లో మంగళవారం జిల్లాలో మంగళవారం 1077 మంది గైర్హాజర్ అయ్యారని విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. మొత్తం విద్యార్థులు 34,929 మంది పరీక్షలకు నమోదు చేసుకోగా 33,852 మంది హాజరయ్యారని, 1077 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకుల అధికారి గీత నాలుగు పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి ఒక పరీక్ష కేంద్రాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

చెల్లికి న్యాయం చేయని వ్యక్తి రాష్ట్రానికేం చేస్తారు?

సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), మార్చి 26: వైఎస్ వివేకా హత్యకేసులో సీబీఐ అవినాష్‌రెడ్డి దోషి ని తేల్చాక చర్యలు తీసుకొని సొంత చెల్లికి న్యాయం చేయాల్సిన సీఎం జగన్ ఆ పని చేయలేదని, అలాంటి వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినాష్‌రెడ్డిని ఆరెస్టు చేసి విచారిస్తే వివేకా హత్యకేసులో నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉండి బాబాయ్ హత్యకేసులో నిందితులను తేల్చలేని వ్యక్తికి పరిపాలించే అర్హత్ లేదన్నారు. గత టీడీపీ హయంలో పెట్టుబడుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉంటే ప్రస్తుత జగన్‌రెడ్డి పాలనలో డ్రగ్స్, గంజాయి దిగుమతులు, ఎగుమతుల్లో నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

హుండీ లెక్కింపు

మహానంది, మార్చి 26: మహానంది అభిషేక మండపంలో మంగళవారం ఉభయ ఆలయాల హుండీలని లెక్కించారు. విరాళాలుగా రూ.38,37,413 వచ్చాయని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గత 33 రోజులకుగాను ఆలయాల హుండీల నుంచి రూ.37,86,188, అన్నప్రసాదం హుండీ నుంచి రూ.33,325, గోవు సంరక్షణ హుండీ నుంచి రూ.17900, యుఎస్ఏ డాలర్స్ రెండు, శ్రీలంక 20 రూపాయలు, నేపాల్ 10 రూపాయలు ఒకటి, దుబాయి ఒక రియాల్ వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో వెలుగోడు గ్రూప్ దేవాలయాల ఈవో జనార్దన్, దేవస్థానం ఏఈఓలు మధు, వెంకటేశ్వరుడు, అర్చకులు, కర్నూలు తిరుమల బాలాజీ సేవా సమితి, కర్నూలు బాలాజీ సేవా ట్రస్టు సేవకులు హాజరయ్యారు.

అవినీతికి పరాకాష్ఠ జగన్ ప్రభుత్వం

డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ, ఆర్థర్

నంద్యాల టౌన్, మార్చి 26: రాష్ట్రంలో ఐదేళ్ళ జగన్ ప్రభుత్వ పాలన అవినీతికి, విధ్వంస, వినాశకర పాలనకు పరాకాష్ఠగా మారిందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం నంద్యాలలోని డీసీసీ కార్యాలయంలో నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్‌తో కలిసి విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఏపీ 40 ఏళ్ళ వెనక్కి తిరోగమించిందని విమర్శించారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని, జగన్ మాయమాటలను మరోసారి నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపు ఇచ్చారు. నంద్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధే తప్ప జగన్ ప్రభుత్వంలో ఏ ఒక్క అభివృద్ధి జరగలేదని విమర్శించారు.

తీవ్రంగా అవమానించారు?: తొగూరు ఆర్థర్

వైసీపీలో తనను తీవ్రంగా అవమానించారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ వైసీపీ అధినేత జగన్ తీరుపై విరుచుకుపడ్డారు. అవమానాలకు గురి చేసి తన హక్కులను కూడా ఇతరులకు బదిలీ చేయడంతో వైసీపీకి గుడ్‌బై చెప్పాల్సి వచ్చిందని అన్నారు. వైసీపీకి రాజీనామా చేశాక ఎంతో మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, పలువురు ప్రముఖులు తనతో మాట్లాడారని, తన నిర్ణయం సరైనదేనని అన్నారని అన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను తమ తాత ముత్తాతలందరూ పాటిస్తూ పార్టీలో సైనికుల్లాగా పని చేశారని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే ఏ పని చేయడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

జగన్ పార్టీని చిత్తుగా ఓడించాలి



కర్నూలు(అర్బన్), మార్చి 26: 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నేరవేర్చని జగన్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి విలేఖర్లతో మాట్లాడుతూ మద్య నిషేధం, టిడ్కో ఇళ్లు ఇవ్వకపోవడం, విద్యుత్ చార్జీలు పెంచడం, పన్నుల భారం మోపడం, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం, జాబ్ క్యాలండర్ విడుదల చేయకపోవడం, 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ మాట తప్పడం, మెగా డీఎస్సీని దగా డిఎస్సీగా మార్చడం, నిరుద్యోగ యువతను రోడ్డు పాలు చేయడం, గ్రీన్ ట్యాక్స్, మద్యం ధరలు పెంచి లక్షల కోట్లు దోచేయడం వంటి పనులు చేసిన వైసీపీని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. నిరుద్యోగ భృతి, విదేశీ విద్య, చంద్రన్న బీమా, రైతు రుణ మాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపు కుంకుమ, ఆదరణ లాంటి సంక్షేమ పథకాలు రద్దు చేసి జగన్‌రెడ్డి లక్ష కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని మండి పడ్డారు. బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు.

లిక్కర్ డంప్ స్వాధీనం

- రూ.5.40 లక్షల మద్యం స్వాధీనం
- ఒకరి అరెస్టు

ఆలూరు, మార్చి 26 : ఆలూరు సెబ్ పరిధిలోని చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామకొండల్లో నిలువ ఉంచిన భారీ మద్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ మద్యం విలువ రూ.5.40 లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులో రామదుర్గం గ్రామంలో నివాసం ఉంటున్న బెల్లి మల్లికార్జున పాత్ర ఉన్నట్లు విచారణలో గుర్తించామని అన్నారు. ఆయన ఇంట్లో ఉన్న మద్యం బాక్సులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం సాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచి కర్ణాటక మద్యం సరఫరాను నియంత్రిస్తామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇంకా ఇద్దరు వ్యక్తులను పట్టుకోవడానికి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నాగరాజు, డివిజనల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రెండు టీములను ఏర్పాటు చేశామన్నారు. దాడులలో ఆలూరు ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఎమ్మెల్యేపై ఫిర్యాదు

కర్నూలు, మార్చి 26: వైసీపీ మైనార్టీ సిటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ జిలాన్ బాషా ఖాద్రి అనే వ్యక్తి కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, అతని అనుచరులు జాఫర్, మహబూబ్, సునీల్ అనే వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను కొన్నేళ్లుగా ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అనుచరుడిగా ఉంటున్నానని, అయితే.. ఆ నాయకత్వం నచ్చక దూరంగా ఉంటున్నానని చెప్పారు. గత ఆరు నెలలుగా ఎమ్మెల్యేతో పాటు ఆయన అనచరులు వేధిస్తున్నారని అన్నారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే అనుచరులు వచ్చి కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, ఎమ్మెల్యే ఇంటి సమీపంలో ఉన్న తుంగభద్ర నది బ్రిడ్జి వద్ద కొట్టారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తర్వాత మాసూంబాషా దర్గా వద్ద తనను వదిలేసి వెళ్లారని చెప్పారు. ఈ విషయమై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టూటౌన్ సీఐ ఇంతియాజ్‌బాషాకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీఐని వివరణ కోరగా నిజనిజాలపై విచారిస్తున్నామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా సయ్యద్ జిలాన్ బాషా ఖాద్రి తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని తిరిగి పోలీసులకు చెప్పడం కొసమెరుపు. అయితే ఎమ్మెల్యే ఒత్తిడితోనే ఇలా యూటర్న్ తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

రుద్రవరం, మార్చి 26 : ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీతో రుద్రవరం గ్రామ వలంటీర్లు.. అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైంది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర స్పందించారు. రాజు, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు వలంటీర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. మరో వలంటీరు మల్లికార్జున రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నంద్యాలకు ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారు?

- సీఎం జగన్‌పై టీడీపీ నాయకుల ఆగ్రహం



తంగడంచలో పైలాన్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, మార్చి 26: టీడీపీ హయాంలో చంద్రబాబు కంపెనీలు ఏర్పాటు చేయడానికి పునాదులు వేస్తే.. సీఎం జగన్ పట్టించుకోలేదని, ఏం ముఖం పెట్టుకొని నంద్యాల జిల్లాకు వస్తున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తంగడంచలో ఏర్పాటు చేసిన జైన్ పరిశ్రమను టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు మంగళవారం పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చాక పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పరిశ్రమలకు కేటాయించిన భూములు అడవిని తలపిస్తున్నా యన్నారు. ప్రశ్నించేవారే గొంతులు నొక్కడం, దాడిచేయడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై జగన్‌కు చిత్తశుద్ధిలేదని అన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తాజయసూర్య, సురేంద్రనాథ్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, జంగాలపెద్దన్న, ప్రసాదరెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగరాజు, సుబ్బన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో 18 నెలల బాలుడి మృతి

రుద్రవరం, మార్చి 26 : వడదెబ్బతో 18 నెలల బాలుడు మృతి చెందాడు. నంద్యాల జిల్లా రుద్రవరం మండల కేంద్రానికి చెందిన రాజేశ్వరమ్మ - బ్రహ్మయ్య ఆచారి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. తలనీలాలు సమర్పించేందుకు సోమవారం అహోబిలం వెళ్లారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తలనీలాలు సమర్పించి అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్నారు. బాలుడు లక్ష్మీనరసింహాచారికి తల్లి రాజేశ్వరమ్మ పాలు పట్టి ఊయలలో పండబెట్టింది. మంగళవారం ఉదయం నిద్రలేవకపోవడంతో స్థానికంగా ఉన్న వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యాధికారి తెలిపారు. వడ దెబ్బ వల్లే మృత్యువాత పడినట్లు ఆయన వెల్లడించారు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

కుంగిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు

రుద్రవరం, మార్చి 26 : మండలంలోని చిన్నకంబలూరు మెట్ట సమీపంలో కుంగిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో కుంగిన ఆర్‌అండ్‌బీ రోడ్డు, మహిళ బలి.. అనే శీర్షిక అచ్చయిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. ముందే ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని ఉండింటే మహిళ ప్రాణం పోయేది కాదనే విమర్శలున్నాయి.



కుంగిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేసిన దృశ్యం

ముగ్గురు విలేకర్లపై కేసు నమోదు

ఇద్దరు విద్యార్థి సంఘం నాయకులపై కూడా..

జూపాడుబంగ్లా, మార్చి 26: ముగ్గురు విలేకరులు, ఇద్దరు విద్యార్థి సంఘం నాయకులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నందికొట్కూరుకు చెందిన విలేకర్లు ఎం.చంద్రశేఖర్ (ఉత్తేజిత), పరమేష్(ఆంధ్రప్రభ), హుస్సేనాలం(ఉత్తేజిత), దక్కకుమార్ (ఎస్ఎఫ్ఐ), మద్రిస్వామి (పీడీఎస్‌యూ)లు ఈ నెల 25న ఎటువంటి అనుమతి లేకుండా జూపాడుబంగ్లాలోని ఎస్సీ బాలికల వసతి గృహంలోకి వెళ్లారు. వార్డెన్ ఉమాదేవి వద్దకు వెళ్లి హాస్టల్‌లో ఓ బాలిక గర్భం దాల్చిందని, ఆ అమ్మాయిని చూపించాలని అన్నారు. లేకుంటే వ్యతిరేకంగా వార్తలు రాస్తామని బెదిరించారు. అయితే వీరి వ్యవహారాన్ని చూసిన తోటి విద్యార్థినులను వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో విలేకరులు, విద్యార్థి నాయకులు విద్యార్థినులను నానాబూతులు తిట్టి భయభ్రాంతులకు గురి చేశారు. హాస్టల్ వార్డెన్ ఉమాదేవి వీరి వ్యవహార శైలిని భరించలేక పై అధికారులకు తెలిపింది. వారి సూచన మేరకు సోమవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపారు. ఈ విషయంపై సదరు విలేకరులు, విద్యార్థి సంఘం నాయకులను వివరణ కోరగా బాలిక గర్భం దాల్చినట్లు తమ దృష్టికి రావడంతో వసతి గృహం వద్దకు వెళ్లామని, దీంతో వార్డెన్ తమపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

తాగునీటి సమస్య

● పడమర ప్రాతకోట బీసీ కాలనీ ప్రజల అవస్థలు


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

పగిడ్యాల, మార్చి 26: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలోని విఘ్నేశ్వర దేవాలయ సమీపంలోని బీసీ కాలనీలో నెలల తరబడి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని లేదని మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి పలు కాలనీలకు మెయిన్ రోడ్డు నుంచి కనెక్షన్ ఇచ్చారని, అయితే తమ కాలనీకి మాత్రం దిగువన కనెక్షన్ ఇవ్వడంతో నీటి సమస్య నెలకొందని అంటున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో రెండు నెలలుగా వీధి కొళాయిలకు ఒక్క బిందె నీరు కూడా రావడం లేదని వాపోయారు. కొళాయిలకు నీరు రాకపోవడంతో సమీపంలోని ముస్లిం కాలనీలో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకుల నుంచి కూడా ఆరు నెలలుగా మినీ ట్యాంకుకు కూడా నీరు రావడం లేదని, దీంతో ఆ ట్యాంకు నిరుపయోగంగా మారిందని చెప్పారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసున్నారు. కాలనీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఇషామ్‌ను వివర ణ అడుగగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కారించలేమని చెప్పడం విశేషం.


ముస్లిం కాలనీలో నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంకులు

'ఘర్షణలకు పాల్పడితే చర్యలు'


బి.కోడూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

బండిఆత్మకూరు, మార్చి 26: ప్రజలు, పార్టీల నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. మంగళవారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో మండలంలోని బి.కోడూరు, వెంగళరెడ్డి పేట, కడమలకాల్వ, ఈర్నపాడు, సోమయాజులపల్లె గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని కూడళ్లలో ఎస్ఐ ప్రజలతో మాట్లాడారు. ఘర్షణలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల అభివృద్ధికి అందరూ ఏకమై ముందుకు సాగాలని సూచించారు. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు నేరం'


శివపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి, మార్చి 26: బాల్య వివాహాలు చేయవద్దని, అలా చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని శివపురం, గోకవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 'భేటీ భచావో.. భేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా పాఠశాలల విద్యార్థులతో గ్రామ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆడపిల్లలను చదివించాలి.. అలాగే రక్షించాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు రత్నకుమారి, ఇందిరాకుమారి, షాహీన్‌షా, రవికుమార్, మహిళా పోలీసు రోజాబిందు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

పాణ్యం, మార్చి 26: మండలంలోని బలపనూరు పరిధిలోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచా ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తులతో ఈవో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మార్చి 26: శ్రీశైలం దేవస్థానంలో మంగళవారం కర్ణాటక, మహారాష్ట్ర పాదయాత్ర భక్తబృందాలతో ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించ నుంది. ఈ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాలకు చెందిన పాదయాత్ర భక్త బృందాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలపై చర్చించారు. ఈవో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరగబోయే ఉగాది మహోత్సవాల సమయంలో భక్తులంద రికీ అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నట్లు తెలిపారు. అయితే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు రోజుకు నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అయితే స్వామివారి స్పర్శదర్శనం రూ.500 టిక్కెట్లును ఒక్కొక్క విడతలో 1500 టిక్కెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రపరిధిలోని ఆరుబయలు ప్రదేశాలలో చలువపందిర్లు, మంచినీటి సౌకర్యం, శౌచాలయాలు, విద్యుత్ దీపాలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్న భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన స్వచ్ఛందసేవకుల సేవలను దేవస్థానం వినియోగించుకుంటుందని, లాటరీ పద్ధతిలో స్వచ్ఛంద సేవా బృందాలకు ఆలయం, క్షేత్రపరిధిలోని ప్రదేశాలలో కేటాయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి రమణమ్మ, దేవస్థాన పరిపాలన, ఆలయ ప్రజాసంబంధాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా కీలక పాత్ర పోషించాలి: కలెక్టర్


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

నంద్యాల (కల్చరల్), మార్చి 26: ఎన్నికల్లో మీడియా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో సాధారణ ఎన్నికల నేపథ్యంలో మీడియా పోషించాల్సిన పాత్ర, పెయిడ్ న్యూస్, పత్రికలలో ప్రకటనలు, స్థానిక కేబుల్ ప్రసారాలలో రాజకీయ ప్రకటనలు, తదితర అంశాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా ఎన్నికల మీడియా కేంద్రం నుంచి ఐఅండ్‌పీఆర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు తెలియజేస్తామన్నారు. డీఆర్వో పద్మజ, ఎల్‌డీఎం రవీంద్రకుమార్, ఎంసీఎంసీ నోడల్ అధికారి సునీల్‌కన్నా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి'

నంద్యాల (కల్చరల్): వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బంది లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌నందు వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైతే బోర్లు మరమ్మతులకు గురయ్యాయో వాటిని వెంటనే గుర్తించి రిపేరు చేయించి త్రాగునీటికి అనుగుణంగా అందుబాటులోకి తీసుకురావాలని జడ్పీ డిప్యూటీ సీఈవోను ఆదేశించారు. రక్షిత నీటి పథకాలకు సంబంధించిన పనులు ప్రతిపాదనలు బుధవారం సాయంత్రంలోగా పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వైభవంగా సుంకులా పరమేశ్వరీదేవి జాతర

బండిఆత్మకూరు, మార్చి 26: మండలంలోని బరకల కాలనీ గ్రామంలో సుంకులా పరమేశ్వరి జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి మూడేళ్లకోసారి కాలనీ వాసులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి, కాయ, కర్పూరాలు సమమర్పించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బండిఆత్మకూరు, మార్చి 26: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కృష్ణనంది ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. కోటపాడు గ్రూపు దేవాలయాల అధికారి వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో ఈవో రామాంజనేయశర్మ హుండీ దాదాయం లెక్కింపు చేపట్టారు. ఏడాది కాలానికి రూ.1,17,395 వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ తిరుపంరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఆదిలక్ష్మిరెడ్డి, అర్చకుడు మనోహర్‌శర్మ, అంజనేయులు పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల భీమలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించగా రూ.42,634 వచ్చినట్లు ఆలయ ఈవో రామాంజనేయశర్మ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాదికారిగా కోటపాడు గ్రూప్ దేవస్థానాల కార్యనిర్వహణాధికారి వేణునాథరెడ్డి సమక్షంలో హుండీని లెక్కించారు. ఈ హుండీ ఆదాయం సంవత్సర కాలానికి గాను వచ్చిందని ఈవో తెలిపారు. దేవస్థానం మాజీ చైర్మన్ సన్నల వెంకటరెడ్డి, బాలాజీ సేవా ట్రస్టు సభ్యులు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

61 మంది విద్యార్థుల గైర్హాజరు

కొత్తపల్లి, మార్చి 26: మండలంలోని గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పది పబ్లిక్ పరీక్షలకు మంగళవారం 61 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్ ఎగ్జామినర్లు రఘుస్వామి, ఇబ్రహీం తెలిపారు మంగళవారం జరిగిన పరీక్షకు కొత్తపల్లి సెంటరులో 208 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 169 మంది హాజరు కాగా, 39 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. అలాగే గోకవరం సెంటరులో 117 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 95 మంది హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

'ఎన్నికల నియమావళిని పాటించాలి'

ఆత్మకూరు, మార్చి 26: రానున్న సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని శ్రీశైలం రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజీకయ పార్టీల నాయకులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆత్మకూరు తహసీల్దార్ కె.బాబు ఉన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ


కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు

శ్రీశైలం, మార్చి 26: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితి. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

పోలీసులకు డీజీపీ కమాండేషన్ పతకాలు

కర్నూలు, మార్చి 26: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా పోలీసులకు డీజీపీ కమాండేషన్ డిస్క్ పతకాలు లభించాయి. 2022 సంవత్సరానికి సిల్వర్, కాంస్యం విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పతకాలను ప్రకటించింది.

● **సిల్వర్ విభాగంలో:** జి.కృష్ణకాంత్, (జిల్లా ఎస్పీ కర్నూలు), చెన్నయ్య, (హెచ్‌సీ, సీ.బెళగల్), సుభాన్ (హెచ్‌సీ, ఆదోని వన్‌టౌన్), చంద్రశేఖర్ (హె చ్‌సీ, శిరివెళ్ల), షేక్ ఇబ్రహీం (హెచ్‌సీ, కోవెలకుంట్ల), సీ వెంకటరమణ (పీసీ, సెకండ్ బెటాలియన్), లక్ష్మణ్ సింగ్ (పీసీ సెకండ్ బెటాలియన్).

● **కాంస్య విభాగంలో:** కే మల్లికార్జున (ఎస్ఐ, కర్నూలు), నాగరాజు (హెచ్‌సీ, ఎమ్మిగనూరు), ఎస్.నాగరాజు (పీసీ, సీసీఎస్), కాశీం (పీసీ ఆదోని తాలుకా), రామక్రిష్ణ (పీసీ, కోడుమూరు), రమేష్ (పీసీ, సీ.బెళగల్), చంద్ర బాబు నాయుడు (పీసీ, ఎమ్మిగనూరు), నరేంద్ర (పీసీ, ఆదోని త్రీటౌన్), భాస్కర్ (పీసీ, కర్నూలు), తిప్పేస్వామి (డీఎస్పీ, నంద్యాల), వి.నాగరాజు (హె చ్‌సీ, నందికొట్కూరు), జి.రమేష్ (పీసీ, ఎస్‌బీ, నంద్యాల), మధుసుధాకర్ (పీసీ, నంద్యాల త్రీటౌన్), గురుబాబు (పీసీ, బేతంచెర్ల), క్రిష్ణమూర్తి (పీసీ, నంద్యాల), పెద్దస్వామి, (పీసీ, నంద్యాల), శ్రీనివాసులు (హెచ్‌సీ, నంద్యాల)., శివశంకర్ రెడ్డి (ఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), అయ్యన్న (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలి యన్), క్రిష్ణయ్య (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), గోపాల్ (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), సుందర్‌రాజు (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), ప్రహ్లాదరావు (హెచ్‌సీ, సెకండ్ బెటాలియన్).

బడుగులను బలి తీసుకోవడమే సామాజిక న్యాయమా?: ఫరూక్


మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 26: రాష్ట్రంలో బడుగులను బలి తీసుకోవడమే వైసీపీ సామాజిక న్యాయమా? అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ ప్రశ్నించారు. మంగళవారం నంద్యాలలోని ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫరూక్ మాట్లాడారు. జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేదన్న విషయం చేనేత కుటుంబ బలవంతపు మరణంతో రుజువైందని అన్నారు. వారి బలవంతపు మరణానికి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ సొంత జిల్లా కడపలో నందం సుబ్బయ్య అనే పద్మశాలి నేతను అత్యంత దారుణంగా హత్య చేశారని, నేటికీ నిందితులపై చర్యలు ఎందుకు లేవని మండిపడ్డారు. రాష్ట్రంలో బీసీలపై దాడులకు వైసీపీ తెగబడుతుందని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): నంద్యాల పట్టణం గాంధీచౌక్‌లోని మసీద్ ఏ ఖురైస్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. మసీదు పెద్దలు, ముస్లిం సోదరులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆత్మకూరులో ఎమ్మెల్యే శిల్పాకు షాక్..!

● వైసీపీని వీడిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తిమోతి

● మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరేందుకు సిద్ధం


బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిసిన తిమోతి

ఆత్మకూరు, మార్చి 26: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఆత్మకూరులో గట్టి షాక్ తగిలింది. ఆయన అనుచ రుడు, వైసీపీ జిల్లా కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ వై.తిమోతి ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డిని వేల్పనూరులోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి త్వరలోనే తన అనుచరగణంతో టీడీపీలోకి చేరుందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అయన మాట్లాడుతూ.. శ్రీశైల నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా గెలుపు కోసం అహర్నిశలు పనిచేశానని, అయితే ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను నమ్మించి మోసం చేసే వ్యక్తి శిల్పా చక్రపాణిరెడ్డి అని ఆరోపించారు. 2019 ఎన్నికల ముందు తాను కౌన్సిలర్ పదవిలో కొనసాగుతూనే వైసీపీలోకి చేరానని, ఆ సందర్భంగా కౌన్సిలర్‌గా తనకు పోటీ చేసేందుకు అవకాశం ఇస్తానని శ్రీశైల మల్లన్న సాక్షిగా హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు

వెలుగోడు: టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళ వారం వైసీపీ నాయకుడు అమీర్ అలీ ఖాన్‌తో పాటు 140 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే రేగడ గూడూరు గ్రామానికి చెందిన కొందరు యువకులు టీడీసీ కార్యాలయంలో బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరారు. నాయకులు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, కృష్ణుడు, రామానాయుడు, నాగశేఖర్, శీను, హంజా, వీరభద్రుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

గడివేముల, మార్చి 26: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ మద్యం తాగి ద్విచక్రవాహనం నడపడంతో కేసు నమోదు చేసి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచినట్లు చెప్పారు. దీంతో 14 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

వెలుగోడు, మార్చి 26: వెలుగోడు పట్టణ శివార్లలోని ఏపీ మోడల్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంకు గాను ఇంటర్ మొదటి సంవత్సరం చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎంపిసి బైపిసి ,సిఈసి, ఎంఈసి గ్రూపులలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 నుంచి మే 2వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలు

● సి-విజిల్ ఫిర్యాదులపై స్పందించిన అధికారులు

● రేషన్ డీలర్, మెప్మా ఆర్పీ, ఇద్దరు వలంటీర్ల తొలగింపు

ఆత్మకూరు, మార్చి 26: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైలం నియోజవకర్గం పరిధిలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై ఎట్టకేలకు ఎన్నికల అధికారులు వేటు వేశారు.మంగళవారం శ్రీశైలం నియోజకవర్గం పరిధిలో సీ-విజిల్ యాప్ ఫిర్యాదుల వివరాలను నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి మీడియాకు వెల్లడించారు. ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఈ-విజిల్ యాప్ ద్వారా 18ఫిర్యాదులు తమకు అందాయని తెలిపారు. వీటిపై 90నిమిషాల వ్యవధిలోనే స్పందించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందులో ప్రత్యేకించి ఎన్నికల సమయంలో డీఎస్సీని వాయిదా వేయాలని డీఎస్సీ అభ్యర్థులు ఏడు ఫిర్యాదుల ద్వారా ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీలకు సంబంధించి 4 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. వీటిపై కూడా వెంటనే స్పందించామని చెప్పారు. ఆత్మకూరు ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా 15ఏళ్లగా ఇద్దరు హోంగార్డులు, ఐదేళ్లగా ఒక కానిస్టేబుల్ ఇక్కడే పనిచేస్తున్నారని వారిని బదిలీ చేయాలని ఫిర్యాదులు వచ్చిందని అన్నారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వలంటీర్లపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంతో ఎన్నికల నియమావళిని అనుసరించి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని అన్నారు. ఇకపోతే వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫిర్యాదుల్లో భాగంగా ఆత్మకూరు మండలంలోని సిద్దాపురం గ్రామానికి చెందిన యేసుబాబు అనే రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేశామని, ఆత్మకూరు మెప్మా విభాగంలో రీసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్న పరిమళను తొలగించామని, శ్రీశైలంలోని సున్నిపెంటలోని 4వ సచివాలయం పరిధిలో వలంటీర్లుగా పనిచేసిన వెంకటరత్నకుమార్, చాంద్‌బాషాలు వారే స్వయంగా రాజీనామాలు చేయడంతో తొలగించామని అన్నారు. ఇకపోతే వెలుగోడులోని సచివాలయం-1లో పనిచేస్తున్న గౌస్ అనే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగి ఎథిక్స్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వద్ద ప్రస్తుతం కూడా పర్సనల్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నారని, ఈవిధంగా కొనసాగేందుకు ఎన్నికల నియమావళి ప్రకారం అవకాశం ఉందా..? లేదా..? అనే అంశంపై పరిశీలన చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే పర్యటన వివరాలు తెలిపేందుకు సచివాలయ ఉద్యోగి గౌస్ అక్కడికి వెళ్లారని తమకు తెలియపరిచినట్లు చెప్పారు. దీనిపై త్వరలోనే స్పష్టత ఇస్తామని వెల్లడించారు. కాగా ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలు, వేతనాలు పొందుతున్న వారు ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా పాల్గొనరాదని, ఎక్కడైనా పాల్గొన్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: శబరి


ఎల్‌కే తండా వాసులతో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

గడివేముల, మార్చి 26: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. మండలంలోని వండుట్ల గ్రామ సమీపంలో వెలసిన రంగస్వామి ఆలయంలో మంగళవారం ఆమె పూజలు నిర్వహించారు. రంగల్‌దర్వేసి ఖాద్రికి ఫాతెహాలు సమర్పించారు. అనంతరం ఆమె ఎల్‌కే తండా, వైకే తండా గ్రామస్థులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శబరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని అన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఏ రఫిక్, రాజునాయక్, సుబ్బన్న నాయక్, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగల పాలనకు చరమగీతం పాడాలి: మాండ్ర


నందికొట్కూరులో ర్యాలీగా వెళ్తున్న శివానందరెడ్డి, జయసూర్య

నందికొట్కూరు, మార్చి 26: దొంగలను ఎన్నుకుంటే పాలన ఎలా ఉంటుందో ఈ ఐదేళ్ల కాలంలో అర్థమైందని, వీరి పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాండ్రతో పాటు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్యకు ఏబీఎం పాలెం వాసులు అల్లూరు సర్కిల్ నుంచి భారీ ర్యాలీగా తమ కాలనీలోకి ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో మంగళవారం సోమశేఖర్ గౌడు ఆధ్వర్యంలో భాస్కరనాపురం గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు సామన్న, నందికొట్కూరు పట్టణ కార్పెంటర్లు జమీల్, అయ్యన్న ఆధ్వర్యంలో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి జయసూర్య, మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'వైసీపీ పనైపోయింది'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 26: ప్రజా వ్యతిరేక పాలనతో వైసీపీ పని అయిపోయిందని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వైసీపీ కార్యకర్తలు, అభిమానులు టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్ఎండీ ఫిరోజ్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఫిరోజ్ మాట్లాడుతపట్టణంలోని వార్డుల్లో వైసీపీ ఏజెంట్లు టీడీపీ నాయకులను, కార్యకర్తలను డబ్బులు పెట్టి కొనాలని చూసినా టీడీపీ నాయకులు అమ్ముడుపోరని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆయన అన్నారు.

'టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి'

పాణ్యం, మార్చి 26: టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని టీడీపీ ముస్లీం మైనారీ కార్యవర్గ సభ్యులు ఖాదర్‌బాషా అన్నారు. టీడీపి శంఖారాంలో భాగంగా మంగళవారం సుగాలిమెట్ట సమీపంలోని మామిడి తోటల్లోని గిరిజనులకు సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ అజెండా కరపత్రాలు పంపిణీ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ కన్వీనర్ మహబూబ్‌బాషా, చెంచు మహిళలు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే శిల్పాకు ఓటమి భయం'

ఆత్మకూరు, మార్చి 26: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి కర్నాటి శ్రీరాములు, సీనియర్ నాయకులు బొజ్జ శేషకుమార్ పురం హరీష్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరులోని అర్బన్‌కాలనీలో వైసీపీలోకి జనసేన పార్టీ శ్రేణులు చేరారని వైసీపీ నాయకులు ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. వైసీపీకి చెందిన వారినే రిసైక్లింగ్‌గా తిరిగి వైసీపీలోకి చేర్చుకుంటూ తమ పార్టీలోకి ఇతర పార్టీల వారు చేరుతున్నారని చెప్పుకోవడాన్ని చూస్తే ఎమ్మెల్యే శిల్పాకు ఓటమి భయం పట్టుకోవడం వల్లే ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వైసీపీ చేసిన దుర్మార్గాలతో పాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా కక్షసాధింపు చర్యలు, దోపిడి పరిపాలనను ఇక్కడి జనసైనికులు మరవరని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఖాజాహుసేన్, పవన్, హబీవుల్లా, వహీద్, చంద్రశేఖర్ నాయక్ తదితరులు ఉన్నారు.

'పరీక్ష తప్పిన విద్యార్థులకు మరో అవకాశం'

శ్రీశైలం, మార్చి 26: శ్రీశైలం మండలం సుండిపెంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2010 నుంచి 2014 సంవత్సరం డిగ్రీ ఉత్తీర్ణత కాని విద్యార్థులకు రాయలసీమ విశ్వవిద్యాలయం మరో అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. బుచ్చయ్య మంగళవారం తెలిపారు. పరీక్ష ఫీజు కట్టుకొనుటకు చివరి గడువు ఈ నెల 30 వరకు ఉందని చెప్పారు. ఉత్తీర్ణత పొందని విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, మార్చి 26: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్న ప్రసాద వితరణ పథకానికి మంగళవారం కర్నూలుకు చెందిన పత్తికొండ విజయలక్ష్మీ అనే భక్తురాలు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన జేఎస్ఎస్‌పీ శర్మ అనే భక్తుడు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు మధుసుదన్‌రెడ్డికి అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం



మూడురాళ్లపల్లెలో ముళ్ల కంపలు తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

చాగలమర్రి, మార్చి 26: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వాసవీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం శ్రమదానం చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ముళ్ల కంపలను తొలగించారు. దేవాలయాల పరిసరాల్లో శ్రమదానం చేశారు. 10 రోజుల పాటు విద్యార్థులు శ్రమదానం నిర్వహిస్తారని ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చాగలమర్రి టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు రహదారిలో శిరివెళ్ల ఎస్ఐ సురేష్ నాయుడు, పోలీసులు మంగళవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేశారు. వాహనాల్లో నగదు, మద్యం అక్రమంగా తరలించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అధిక మొత్తంలో నగదు తరలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం

చాగలమర్రి, మార్చి 26: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు అన్నారు. మంగళవారం వినాయకనగర్ సమీపంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్-6 కరపత్రాలను అందజేశారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, అజీమ్, కరిముల్లా, ఖాజారసూల్, భాస్కర్‌రెడ్డి, అబ్దుల్లా, నూర్‌బాషా, బషీర్, రమేష్, ఓబులేసు, చోటు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జమాల్‌వలి స్వామి ఉరుసు

చాగలమర్రి, మార్చి 26: మండలంలోని క్రిష్ణంపల్లె గ్రామంలో వెలసిన జమాల్‌వలిస్వామి ఉరుసు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రజలు దర్గా వద్ద ఫాతెహాలు సమర్పించారు. జమాల్‌వలి స్వామి జెండాను గ్రామంలో ఊరేగింపు చేసి దర్గాలో కొలువుదీరింప చేశారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

చాగలమర్రి, మార్చి 26: చాగలమర్రి గ్రామంలోని పది పరీక్షా కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామసుబ్బయ్య మంగళవారం తనిఖీ చేశారు. బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రాలను సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల మౌలిక వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో అనూరాధ ఉన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

రుద్రవరం, మార్చి 26 : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అసిస్టెంటు రిటర్నింగ్ ఆఫీసరు మురళీమోహన్ అన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జాతరలు, పెళ్లిళ్లు, తిరుణాల జరుగుతున్న నేపథ్యంలో మైకులు పెట్టడానికి కూడా అనుమతి తప్పనిసరి అన్నారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సమాచారం ఇస్తే ఆ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు పోలీసుశాఖకు కూడా సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో జరిమానా

బనగానపల్లె, మార్చి 26: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివర్గం గ్రామానికి చెందిన విడుదల పెద్దసుబ్బరాయుడు, విజయకుమార్ 2021లో ఘర్షణ పడడంతో అప్పట్లో ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు తెలిపారు. కేసు విచారణ చేసిన తర్వాత బనగానపల్లె మెజిస్ట్రేట్ ఇరువురికి చెరో రూ.10వేలు చొప్పున ఇరువురికి మొత్తం రూ.20వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



రామాపురం వైసీపీ నాయకులకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చంద్రబాబుతోనే అభివృద్ధి: బీసీ

బనగానపల్లె, మార్చి 26: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి అవుకు మండల టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. అవుకు మండల రామాపురం గ్రామానికి చెందిన బండెల అరుణ్, బండెల ఇజ్రాయిల్, కిరణ్, కొండయ్య, నాగయ్య, సూరి, నవీన్, నాగరాజు, కంబయ్య, ఆల్‌ఫ్రెడ్, రాజు, మాధవకృష్ణ, మాన్యం, వడ్డె మధు తదితర 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి బీసీ మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందని అన్నారు. టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

మహిళలకు భద్రత కల్పిస్తాం: బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 26: టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఏరియాకు చెందిన వైసీపీకి చెందిన మహిళలు మంగళవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఇందిరమ్మ టీడీపీ కండువాలు కప్పి టీడీపీలో చేర్చారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సంవత్సరానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు పంపిణీ, ఆడబిడ్డ నిధి కింద సంవత్సరానికి రూ.18వేలు ఆర్థిక సాయం, తల్లికివందన ద్వారా ఎంతమందిపిల్లలు చదివుతుంటే అందరికీ సంవత్సరానికి రూ.15000 ఆర్థిక సాయం అందుతుందన్నారు. చంద్రబాబుతోనే మహిళలకు భద్రత ఉంటుందన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా బీసీ జనార్దన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.

కుంటెమ్మ దేవతకు పూజలు

కొలిమిగుండ్ల: తిమ్మనాయుని పేట గ్రామంలో వెలసిన కుంటెమ్మ దేవత ఆలయంలో బీసీ ఇందిరమ్మ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంటెమ్మ దేవతకు పసుపు ,కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి గోపాల్ ,బాల సుబ్రహ్మణ్యంశెట్టి , వెంకటేశ్వర్లు ,సర్పంచ్ చంద్రకళ, డి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పేదలకు రూ.4వేల ఫింఛన్: కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 26: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే పేదలకు ఇచ్చే సామాజిక పింఛన్ నెలకు రూ.4 వేలు ఇవ్వడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. డోన్ నియోజకవర్గంలో కరువు కాటకాలతో నష్టపోయిన డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ఎందుకు ప్రకటించలేదని మంత్రి బుగ్గన సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎన్నో హామీలు ఇచ్చి నిలువునా ముంచేసిందని మండిపడ్డారు. అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసి వేసి పేదల కడుపు కొట్టిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు, దళితులకు అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి అన్యాయం చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. డోన్ నియోజకవర్గంలో నియంతృత్వ పాలనకు బుద్ధిచెప్పి టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించుకుందామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, మాజీ సర్పంచ్ రేగటి రామ్మోహన్ రెడ్డి, వలసల బాలుడు, ఎర్రగుంట్ల మాజీ సర్పంచ్ మద్దిలేటి, నారాయణ, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా డోన్ టీడీపీ సీనియర్ నాయకులు ధర్మవరం సుబ్బారెడ్డి నియమితులయ్యారు. గతంలో ధర్మవరం సుబ్బారెడ్డి టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలోనే డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలను సుబ్బారెడ్డికి అప్పగించారు. అయితే గత నెలలో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలతో పార్టీ అధిష్టానం సుబ్బారెడ్డికి మూడు రోజుల క్రితం సర్ది చెప్పారు. దీంతో అమరావతిలోని తన నివాసంలో టీడీపీ అధినేత చంద్రబాబు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, సుబ్బారెడ్డిల మధ్య సయోధ్య కుదిర్చారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని సుబ్బారెడ్డికి భరోసా ఇచ్చారు. ఆ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మంగళవారం రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా సుబ్బారెడ్డిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర పార్టీ కమిటీలో సుబ్బారెడ్డికి పదవి రావడం పట్ల పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ధర్మవరం సుబ్బారెడ్డి నియామకం పట్ల హర్షం

డోన్(రూరల్), మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ధర్మవరం సుబ్బారెడ్డిని పార్టీ అధిష్టానం నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. డోన్ పట్టణ టీడీపీ నాయకులు హనుమంతరెడ్డి మాట్లాడుతూ టీడీపీకి ధర్మవరం సుబ్బారెడ్డి అందించిన సేవలను గుర్తించుకుని పార్టీ అధిష్టానం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడం హర్షణీయమన్నారు.

డ్రగ్స్ ఏపీగా మార్చిన వైసీపీ ప్రభుత్వం

నంద్యాల, మార్చి 26, ఆంధ్రజ్యోతి: సీఎం జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఏపీని డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని మాజీ మంత్రి అఖిలప్రియ ఆరోపించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ యువతకు డ్రగ్స్, గంజాయి వంటి వాటిని అలవాటు చేయించి ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తుందని చెప్పారు. పీజీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, డిగ్రీ వంటి చదువులు చదివిన యువతకు ఉద్యోగాలు ఇస్తున్నామంటూ మద్యం షాపుల్లో సెల్స్‌మెన్స్‌గా నియమించుకొని వారి చేత మద్యం వ్యాపారం చేయిస్తూ మద్యానికి బానిసలుగా తయారు చేసిందని ఆరోపించారు. బ్రెజిల్ నుంచి రూ.50 వేల కోట్ల విలువ గల 25 వేల కిలోల డ్రగ్స్‌ను కంటైనర్ ద్వారా విశాఖకు రప్పించారని, ఈ కంటైనర్‌లో ఏముందన్నది తనిఖీ చేయరాదని ప్రభుత్వం పోలీసు శాఖకు ఉత్తర్వులు ఇవ్వడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. తల్లిదండ్రులు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న డ్రగ్స్, గంజాయి సరఫరా పట్ల వ్యతిరేకించకపోతే పిల్లల భవిష్యత్తు అంధకారమేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రగ్స్, గంజాయి వంటి నిర్మూలిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: బ్రెజిల్ డ్రగ్స్‌కు ఏపీ పోలీసులు కాపలా కాస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మాచినేనిపల్లె గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భూమా అఖిలప్రియ, భార్గవరామనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ విశాఖపట్టణం వెళతామని అంటున్నది మూడు రాజధానుల కోసం కాదని అన్నారు. డ్రగ్స్‌కు ఏపీ పోలీసులతో పహారా కాయించి సులభతరంగా రవాణా చేసేందుకు అక్కడకి వెళతామని చెబుతున్నారని ధ్వజమెత్తారు. గంజాయి మత్తులో బాలికలపై దాడులు చేస్తే బాధ్యులెవరని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో 14, 15 ఏళ్ల చిన్నపిల్లలు గంజాయి తీసుకోవడం బాధాకరమన్నారు. నంద్యాల జిల్లాలో బుధవారం పర్యటిస్తున్న సీఎం జగన్‌ను కలిసి ప్రజా సమస్యలను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో గంగుల పృథ్వీరాజ్‌కుమార్‌రెడ్డి, గంగుల ప్రహ్లాదరెడ్డి, పోలా గురుమూర్తి, ఆలమూరు నారాయణ, రాజారావు, బంగారు బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిలప్రియ

రైతుపై వైసీపీ నాయకుడి దాడి

ప్యాపిలి, మార్చి 26: వైసీపీ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి మంగళవారం ప్యాపిలిలో రైతు క్రిష్ణమూర్తిపై దాడి చేశాడు. ఈ ఘటన సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డయింది. మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామానికి చెందిన రైతు క్రిష్ణమూర్తి ఆదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు హనిమిరెడ్డితో మూడేళ్ల క్రితం రూ.50వేలు అప్పు తీసుకున్నారు. మూడేళ్లు వడ్డీ కూడా రైతు చెల్లించాడు. అయితే అసలు చెల్లించలేదన్న ఆగ్రహంతో హనిమిరెడ్డి కొడుకు లక్ష్మీనారాయణరెడ్డి ప్యాపిలిలో బస్టాండు దగ్గరున్న క్రిష్ణమూర్తిపై దాడికి పాల్పడ్డాడు. పంటలు దెబ్బతినడంతో అసలు తర్వాత చెల్లిస్తానని చెప్పిన దౌర్జన్యం చేశాడని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఘటనపై ఎస్ఐ జగదీశ్వరరెడ్డిని వివరణ కోరగా ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పార్టీ కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి

ఉయ్యాలవాడ, మార్చి 26: ఆయా రాజకీయ పార్టీలు మండలంలోని గ్రామాల్లో సాగించే పార్టీ కార్యక్రమాలకు ఆళ్లగడ్డ రిటర్నింగ్ అధికారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీవో రఘురామ్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్ల ఏర్పాట్లు, ప్రచారం కోసం స్పీకర్ల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

బనగానపల్లె, మార్చి 26: మండలంలోని కైప గ్రామంలో అగ్నిప్రమాదంలో గడ్డివాములు కాలిపోవడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. విషయం తెలుసుకున్న టీడీపీ యువనాయకుడు కైప మొదుల్ల రఘునాథరెడ్డి, తదితర టీడీపీ నాయకులు చందాలు వసూలు చేసి రైతు తెలుగు మధుకు రూ. 1.05లక్షల ఆర్థిక సాయం అందించారు. అలాగే అదే గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అను వ్యక్తికి చెందిన మోటారు సైకిల్ ప్రమాదవశాత్తూ కాలిపోవడంతో అతనికి రూ. 23వేలు ఆర్థిక సాయం అందించారు. సాయం చేసిన రఘునాథరెడ్డికి, టీడీపీ నాయకులకు బాధిత రైతు, బాధిత కూలీ కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీనరసింహా స్వామికి గరుడోత్సవం

నంద్యాల, మార్చి 26, (ఆంధ్రజ్యోతి: ఆళ్లగడ్డ మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో బాగంగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామికి దీక్షాహోమం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి గరుడోత్సవం కార్యక్రమాన్ని స్వామికి నిర్వహించారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

కొలిమిగుండ్ల, మార్చి 26: కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరనికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశం పొందడానికి 10వ తరగతి మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. మార్చి 28వ తేదీ నుంచి మే 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి కోరారు.

చెక్ పోస్టును తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

చాగలమర్రి, మార్చి 26: చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్టును కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీరారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కలెక్టర్, ఎస్పీ కడప జిల్లా సరిహద్దు వద్దకు వెళ్లి తిరిగి చాగలమర్రి సమీపంలోని టోల్ ప్లాజా వద్దగల స్థలాన్ని పరిశీలించారు. చెక్ పోస్టులో వాహనాల తనిఖీ సిబ్బంది ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేని, ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బును తరలిస్తే సీజ్ చేయాలని చెక్ పోస్టు అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా చాగలమర్రి, ఆళ్లగడ్డ, యర్రగుంట్ల తదితర ప్రాంతాల్లో పర్యటిస్తుండటంతో ప్రత్యేక నిఘా ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ప్రత్యేక నిఘా భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. వారి వెంట నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, తహసీల్దార్ రమణమ్మ, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

వైభవంగా దీపోత్సవం



గొడిగనూరు శివాలయంలో హారతులు ఇస్తున్న మహిళలు

చాగలమర్రి, మార్చి 26: మండలంలోని గొడిగనూరు గ్రామంలో పౌర్ణమి సందర్భంగా శివపార్వతులకు మహిళలు పౌర్ణమి సందర్భంగా దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 108 దీపాలు వెలిగించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. మహిళలు సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

చాగలమర్రి, మార్చి 26: మండలంలోని క్రిష్ణంపల్లె గ్రామంలో జమాల్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. కొట్టాల గ్రామానికి చెందిన వృషభాలు గెలుపొందగా మొదటి బహుమతి రూ.30 వేలు, ప్రొద్దుటూరు ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన వృషభాలు రెండో బహుమతిగా రూ.20 వేలు, ఓబుళంపల్లె గ్రామానికి చెందిన వృషభాలు మూడవ బహుమతిగా రూ.10 వేలు, ప్రొద్దుటూరులోని తిమ్మయ్య కాలనీకి చెందిన వృషభాలు నాలుగో బహుమతిగా రూ.5 వేలు నగదును దాతలు అందజేశారు. కార్యక్రమంలో దర్గా చైర్మన్ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోవెలకుంట్ల, మార్చి 26: జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు జ్యోతి విద్యానికేతన్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ సవిత్నాధ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ నుంచి 31 వతేదీ వరకు ఢిల్లీలో జరిగే 42 సబ్ జూనియర్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. బాలికల విభాగంలో 9 తరగతి గుణవర్ష ,8 తరగతి యోషిత, బాలల విభాగంలో 8 తరగతి కిరణ్ కుమార్ రెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, పార్వతి, సురేష్, శృతి ,అర్జున్ విద్యార్థులను అభినందించారు.

టీడీపీతోనే రాష్ట్రానికి మంచి రోజులు

ప్యాపిలి, మార్చి 26: టీడీపీతోనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఆ పార్టీ యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నల్లబల్లి, వెంగళాంపల్లి గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసుకుంటే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజాపీర్, గుడిపాడు వెంకటరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వెంగళాంపల్లి కార్యకర్తలతో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

బనగానపల్లె, మార్చి 26: త్వరలో జరిగే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎన్నికల అధికారులు పాటించాలని బనగానపల్లె నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, సెక్టోరియల్ అధికారులు, అకౌంటింగ్ టీం, పోలీస్ సిబ్బంది, తదితర ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల్లో సిబ్బంది నిర్వహించాల్సిన ప్రవర్తనా నియమావళిని గురించి క్షుణ్ణంగా వివరించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే సిబ్బందిపై ఎన్నికల సంఘం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళిని అమలు పరచకుంటే అలాంటి సిబ్బందిపై సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి: బీజేపీ



డోన్ ఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

డోన్(రూరల్), మార్చి 26: ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డె మహారాజ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమ సుందర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం కోరారు. డోన్ రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసే పోలింగు బూతుల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మీ రామయ్య, దామోదర్ నాయుడు, రాఘవేంద్ర ఆచారి, కోడి అశోక్, విష్ణు, జనసేన నాయకులు గణేష్ పాల్గొన్నారు.